# పూల గోల

జీవితానికో కల.

పందిరి మంచానికి మల్లెపూల దండలు వ్రేళ్ళాడుతుండగా వెన్నెల్లాంటి మల్లెల పానుపు మీద తొలి రేయి జరగాలని కన్నె కల.

కానీ అలా జరగనే లేదు. ఏమైందీ?

మనోజుడు అంటే మన్మథుడు.

మనోజ్ నిజంగా మన్మథుడే.

పాల మీగడ లాంటి ప్యాంట్ మీద వెన్నెల తళుకుల లాల్చీతో తెల్లగా చల్లగా మెరిశాడు మనోజ్.

తొలి చూపునకే సుషమ మనస్సు నిశ్శబ్దంగా కరిగి పోయింది.

ఇతనే నా ప్రియుడు నా వరుడు అని అంతర్వాణి ఘోషించింది.

తామర రేకుల పెదవులు. మల్లెల పలువరుస. చామంతి మేని చాయ. కనుబొమలే మన్మథుని ధనుస్సు.

నిలువెత్తు మల్లెల బొమ్మ వంటి ఈ సుందరుని సందిట్లో చేరి కరిగి పోతే జన్మ ధన్యం అనుకుంది సుషమ.

ఈ మల్లెల మనిషితో మల్లెల పానుపుపై కన్నెతనం ధన్యమైతే అంతే చాలు. అలా ప్రతి రేయీ పావనమైతే ఇంకేమి కావాలి? ఏమీ వద్దు. ఇంకేమీ వద్దు అనుకున్నది.

అతనికి తను నచ్చక పోతే అదే నరకం అనుకున్నది. అయితే అతనికి ఆమె నచ్చింది.

మన్మథునికి నచ్చడంతో ఆమె మనస్సు రతీ దేవి అయి ఆనంద లాస్యం చేసింది. పెళ్ళి ముహూర్తం కుదిరింది.

మెడలో తాళి పడుతుండగా పువ్వుల పరిమళం బ్రతుకంతా కమ్మినట్టు

వివశత్వంతో పులకించింది సుషమ.

అయితే కథ అడ్డం తిరిగింది. ఎలాగా?

రతీ దేవికే శోభనం అన్నట్టు తయారయింది సుషమ.

పడగ మీద మణిని తలపిస్తూ మొగలి జడ పైన జాజులు మల్లెల సరాలు తల నిండా తురిమించుకుని పూల రథంలా వెళ్ళింది.

కనకాభిషేకాలకు సిద్ధమైన కలల కళ్ళతో రతిరణక్షేత్రాన్ని ఓరకంట చూసుకుని మన్మథుడి చూపుల కోసం వెదికింది సుషమ.

మనోజ్ మంచం మీద లేదు. అటు సోఫాలోనూ లేదు.

తొలి రేయి ఏవో దాగుడు మూతలతో మొదలు పెడతాడు కాబోలు అనుకుంటూ కలయ జూసింది.

గదిలో లేని మన్మథుడు అవతల బాల్కనీలో స్వింగ్ సోఫాలో విలాసంగా కూచున్నాడు.

పూల తేరులా వచ్చిన రతీ దేవిని చూసి మధుర మనోహరంగా నవ్వాడు. దగ్గరికి వచ్చాడు.

ఊపిరి సుడిబడుతుండగా భుజం మీద చెయ్యి వేసి " అబ్బ ... ఎంత బావున్నావూ?..." అన్నాడు.

ఇంకా బావుంటాను. నీ కోసం ప్రతి రోజూ ప్రతి రాత్రీ ఇంకా ఇంకా బావుంటాను...అని హృదయం పూల సముద్రంలా ఎగసి పడింది. అయితే సముద్రం లోంచే సునామీ దూసుకొచ్చినట్టు మరో మాట వచ్చింది: " కానీ...ఈ పువ్వులే బాలేవు..."అన్నాడతను.

సిగ్గు మరిచి చివ్వున తలెత్తి చూసింది.

అతను నవ్వాడే గాని చాలా బాధగా నవ్వాడు.

" ఈ పూల జడతో అలంకారంతో నువ్వు అచ్చం రతీ దేవిలా ఉన్నావు గాని ...ఇదంతా నాకు నచ్చదుగా....నువ్వు పెట్టుకున్న పువ్వులే కాదు...ఈ మంచం మీద పువ్వులూ దండలూ ఈ డెకరేషన్ అంతా...నాకు ఇబ్బందిగా ఉంది..చాలా ఇబ్బందిగా ఉంది..."

సుషమ చెవుల్లో భూకంపాలు జరిగాయి. ఏమని అడుగుతుందీ? అతనే చెప్తుంటే...

" సుషమా! నీకు నేను చెప్పలేదు కదూ?...చెప్పే అవకాశం రాలేదు.

అంత గొప్ప అవసరమనీ తోచలేదు. ఇంత సేపూ ఈ పూల వాసన భరించ లేకనే ...అవతలి కెళ్ళి కూచున్నాను...నిజం!..."

" వ్హాట్?.."

" అవును సుషమా!...నాకు చిన్నప్పట్నుంచీ పువ్వు లంటే ఎలర్జీ! పువ్వులన్నా పూల వాసన అన్నా పడదు...పువ్వులు దగ్గరగా ఉన్నా కళ్ళు తిరుగుతాయి నాకు!..."

స్వప్న సౌధాలు కూలి పోయాయి.

సుషమకు కళ్ళు తిరిగాయి. సోలి పోయింది.

శోభనం రాత్రి శోభనం జరగ లేదు.

మల్లెలు నవ్వలేదు. ఏడ్చాయి. మొగలి జడ తాచు పామై నట్టు భయపెట్టింది. పూల పడవ లాంటి పందిరి మంచం దారుణ మోహన శాపంలా నిలువెల్లా నిరాశపడి నిట్టూర్చింది.

అతనేమైనా తమాషా చేస్తున్నాడేమో అనుకుంటే అలాంటి దేమీ లేదు. బాల్కనీలో స్వింగ్ సోఫాలో కూచో బెట్టుకుని మనసారా తనివి తీరా మాట్లాడాడు. కల్లా కపటం లేదు. వెన్నెల్లాంటి మనిషి. పాల వంటి మనస్సు.

ఎందుకో ఏమిటో తెలియదు అతనికి పువ్వులంటే చిన్నప్పటి నుంచి ఎల్లర్జీ. కాస్సేపు ఎక్కువగా వాసన చూసినా కళ్ళు తిరుగుతాయి. ఇంకాస్సేపటికి ఊపిరాడ నంత పనవుతుంది. ఎప్పుడూ పువ్వులకి దూరంగా ఉంటాడు. చిత్రమైన ఇబ్బందే. రూపానికి మన్మథుడే. కాని పూల బాణాలు ధరించ వలసిన వాడు...పువ్వుల్ని భరించనే లేడు!

సుషమ అరమరిక ల్లేకుండా చెప్పింది: " కాని ...నాకు పువ్వులంటే ప్రాణమండీ.. పెళ్ళిచూపుల్లో మిమ్మల్ని చూడగానే నాలో బలపడిన కోరిక ఒకే ఒక్కటి.. మల్లెల మధ్యే మన శోభనం జరగాలనీ...."

నిస్పృహతో నిట్టూర్చాడు మనోజ్. " అయితే నీ కోరిక ఈ జన్మలో తీరేది కాదు...సారీ...వెరీ సారీ...రియల్లీ సారీ..." అన్నాడు చెయ్యని తప్పుకి అసహాయంగా లజ్జ పడుతూ.

"సరే పోనీ లెండి..." అనలేక పోయింది సుషమ.

కన్నె జీవితానికే మధుర స్వప్నమైన ఆ కోరికను సరే పోనీ అని ఎలా అనుకో గలదు?

ఆ రాత్రి ఎలా గడపాలో ఇద్దరికీ పాలు పోలేదు.

పువ్వులూ అంకరణలూ అన్నీ తీసి పారేద్దామా అంటే అదీ అంత సులభ సాధ్యం అనిపించ లేదు.

ప్రొద్దున్నే శోభనం గదిని చాలా చూపులు పరిశీలిస్తాయి. పువ్వులే మాయమై పోతే ఎన్నెన్ని అనుమానాలైనా వస్తాయి. అదంత సులభం కాదు.

తెల్లారే దాకా ఇద్దరూ మంచి మిత్రుల్లా కబుర్లు చెప్పుకున్నారు. గదిలో సోఫాలో పడి నిద్ర పోయింది సుషమ. మనోజ్ బాల్కనీలో స్వింగ్ సోఫాలో కునికాడు.

మల్లెల పానుపు దీనంగా నిట్టూర్చింది.

జరగనివి జరిగినట్టే ఎలాగో నటించేసింది సుషమ. తొలిరేయి విశేషాలు అడగ్గల ఫ్రెండ్స్‌ని తప్పించుకుని తిరిగింది. రెండో రాత్రి ఏర్పాట్లలో జోక్యం చేసుకుంది.

పందిరి మంచానికి పువ్వులు పెట్టనివ్వ లేదు.

"సినిమా సీన్‌లా చిరాగ్గా ఉంటుంది..." అని తెలివిగా పువ్వుల్ని తప్పించేసింది.

పువ్వులు లేని తొలి రేయి ఎలా ఉంటుందో ఊహించుకో లేదు సుషమ. ఎండనూ ఎడారినీ ఏమని కల గనాలి?

నిన్నటి సంగతి ఏమీ గుర్తు లేనట్టే ప్రవర్తించాడు మనోజ్.

బట్టలు వేసుకోవడం భోంచెయ్యడం అన్నీ పనులే. శృంగారం కూడా ఒక పనేనా? తొలి శృంగారమైనా అంతేనా?

పాలపుంతలో మనస్సు ఒక తెల్లటి పావురంలా ఎగిరి పోవడం లేదా? రంగులు లేవా? నక్షత్ర కాంతులు లేవా? యక్ష గంధర్వుల అమృత గానాలు లేవా?

పువ్వులు లేక పోవడంతో ఏమీ లేనట్టే అనిపించింది సుషమకు. అతనికి ఏమనిపించిందో అడగ లేదు. అతను చెప్ప లేదు.

తెల్లారే సరికి సుషమకు బాగా గుర్తుండి పోయింది ఒక్కటే. చెమట వాసన.

ఆలుమగల పడగ్గది అతి పవిత్రం. అక్కడే ముందు తరాలు తయా

రవుతాయి అన్నాడు ఒక మేధావి. అంత గొప్ప గదిలో పువ్వులకే చోటు లేదా?

మనోజ్‌తో అప్పుడప్పుడూ పరోక్షంగా పువ్వుల మాట తెచ్చింది గాని అతని చిరాకూ అసహనం చూసి ఇక మానుకుంది సుషమ.

అసలే ఉద్యోగం టెన్షన్‌తో పని ఒత్తిడితో సతమతమౌతూ ఉంటాడు. ఇంట్లో చిరాకు అసలు ఉండ కూడదు.

చీటికీ మాటికీ గుర్తు చేస్తే చివరికి దాంపత్యమే ప్రశ్నార్థకం అయితే ప్రమాదం.

ఎవరికైనా చెప్పుకున్నా లాభం ఉండదు. అతనికి ఇష్టం లేని పువ్వులు నీకు మాత్రం ఎందుకూ?...అనే ఏ పతివ్రత అయినా ఎకసెక్కెం చేస్తుంది. తనకూ పువ్వులంటే ఎలెర్జీ అనుకోవడం ఒక్కటే మార్గం.

అలాగే అనుకోవడం మొదలెట్టింది సుషమ.

అవును నాకు పువ్వులంటే బొత్తిగా ఇష్టం లేదు. పైగా అవంటే అసహ్యం. ఏ పువ్వులన్నా అసహ్యం. ఎందుకంటే మనోజ్‌కి ఇష్టం లేదు. అందుకే నాకూ ఇష్టం లేదు. అంతే.

అలా అనుకోవడం చాలా కష్ట మనిపించింది. అయినా తప్ప లేదు. కష్టాన్నే ఇష్ట పడాలి....

అనుకోకుండా వచ్చిన జానకి కథ అడ్డం తిప్పేసింది.

చిన్న నాటి స్నేహితురాలు జానకి. చాలా సంవత్సరాల క్రితమే అమెరికా వెళ్ళింది. మానసిక శాస్త్రంలో పై చదువులు చదివి పరిశోధనలు చేసింది. అక్కడే పెళ్ళి చేసుకుని స్థిర పడింది. ఇండియాకు ఎప్పుడో గాని రాదు. సుషమ పెళ్ళికి రాలేక పోయింది. అందుకే పనిగట్టుకుని పరామర్శకు వచ్చింది.

అన్ని కబుర్లూ అయ్యాక సుషమను గుచ్చి గుచ్చి చూస్తూ " అంతా ఓకేనా? " అని కన్ను గీటి అడిగింది జానకి.

అర్థమై సిగ్గు పడుతూ సుషమ "ఓకే కన్నా ఎక్కువే" అందే గాని పువ్వుల సంగతి మనస్సులో ముల్లులా గుచ్చుకుని ఊరుకుంది.

అంతటితో పట్టేసింది జానకి. "ఆఁహఁ...ఏదో ఉన్నట్టుందే...చెప్పు ఫర్లేదు..." అంటూ ఎంతైనా ప్రాణ స్నేహితురాలే కాబట్టి కాస్సేపట్లో కూపీ లాగేసింది. "సరేసరి...పువ్వుల మీద ఇది ఎటువంటి ఎల్లర్జీయో తెలియాలి ముందు...దీనికో చిట్కా ఉంది" అంటూ ఐడియా మీద ఐడియా చెప్పింది.

"అబ్బా!...పోనిద్దూ..." అని సుషమ తప్పించుకో జూసినా జానకి వదల్లేదు.

"అమ్మాయ్! సమస్య చిన్నదే అయినా..నువ్వూ అతనూ కూడా గొప్ప అనుభవాన్నీ అనుభూతినీ పోగొట్టు కుంటున్నారు..సమస్య ఏమిటో తెలిస్తే ...తర్వాత పరిష్కారం ఆలోచించ వచ్చు...నువ్వు నేను చెప్పినట్టు చెయ్...అతనికి మాత్రం నా గురించి ఇప్పుడే చెప్పకు...అవసరమైతే తర్వాత నేనే సీన్ లోకి వస్తా..." అని జాగర్తలు చెప్పి వెళ్ళి పోయింది.

పరధ్యానంగా పడగ్గది లోకి వచ్చిన మనోజ్ అనుకోని పారవశ్యంతో హాయిగా ఊపిరి పీల్చాడు. అలవాటుగా దిండుకి జేరగిల బడి మ్యాగజైన్ తిరగేస్తూ ఉండి దాన్ని జార్చేసి " ఆహా..." అంటూ కళ్ళు మూసుకుని మరింత రిలాక్స్ అయ్యాడు. "ఏంటీ..ఇవ్వాళేంటో కొత్తగా....హాయిగా ఉందీ..." అని అతను తర్కించే లోపలే సుషమ అతన్ని సన్నజాజి తీగలా అల్లుకు పోయింది. "స్వీట్‌గా ఉంది కదూ వాసన...బ్రాండ్ న్యూ...సరికొత్త రకం పెర్ఫ్యూమ్...దుబాయ్ నుంచి వచ్చిందట...మా ఫ్రెండ్ పంపించింది...ఇక్కడంతా స్ప్రే చేశాను..." అంది అతని భావాల్ని కొనకంటితో చదువుతూ.

"వావ్...లవ్లీ... ఫెంటాస్టిక్!...ఎలా ఉందీ అంటే...ఫ్లయిట్‌లో వెళ్తూ వెళ్తూ ...డోర్ తీసుకుని అవతల మబ్బుల్లోకి వెళ్ళి పోయి...వాటి మీద పొర్లుతున్న ట్టుంది ...ప్చ్...అలా అనీ చెప్పలేం...మబ్బుకి వాసన ఉండదుగా..." అంటూ ఆ అనుభూతిని చెప్పలేక సతమత మయ్యాడు మనోజ్.

సుషమ జుట్టులో ముఖం పెట్టుకుని నుదురు రాసుకుంటూ "ఎక్కడెక్కడికో వెళ్ళిపోతు న్నట్టుంది...నీ జుట్టే మబ్బులా ఉంది..ఇంతకీ ఏంటీ పెర్ఫ్యూమ్?..." అన్నాడు.

"జాస్మిన్...మల్లెలు...జాజుల అత్తరు..."

"ఊఁ...ఈ పరిమళంతో ఎక్కడికో వెళ్ళి పోవాలని...ఎగిరి పోవాలని ...మాయమై పోవాలని.." అని అతను గోముగా అల్లుకోవడం మబ్బుల్లో పొర్లు తున్నట్టే అనిపించింది.

"మాయమై పోవాల్సింది...నాలోకే..." అని గుసగుసగా రెచ్చ గొడుతూ ఆర్తిగా పొదువుకుంది సుషమ. ఆమె మనస్సులో మల్లెలు విరజాజులు గుసగుసగా చెప్పాయి: పాయింట్ నంబర్ వన్: అతనికి మల్లెల పరిమళం అంటే ఎలర్జీ

లేదు! పైగా పరిమళానికి కరిగి పోయే మనస్సు!

మరుసటి రోజు సాయంత్రం...డైనింగ్ టేబుల్ మీద ఫ్లవర్ వేజ్‌లో ప్లాస్టిక్ పువ్వులు పెట్టింది సుషమ. గులాబీలు మందారాలు రజనీగంధాలు.

మనోజ్ వాటిని చూశాడు గాని ఏమీ మాట్లాడ లేదు. అవి ప్లాస్టిక్ పువ్వులని తెలుస్తూనే ఉన్నాయి.

రాత్రి బెడ్ రూం లో బల్ల మీద మల్లె దండ ఉంది. అదీ ప్లాస్టిక్ పువ్వులదే. తమాషాకి అన్నట్టు జడలో కూడా జానెడు మల్లెదండ పెట్టుకుంది సుషమ.

ఈ రాత్రి పెర్‌ఫ్యూమ్ స్ప్రే చెయ్య లేదు.

పరధ్యానం గొప్ప లక్షణం. మనోజ్ ఒకంతట పట్టించుకో లేదు. తేడా లేమిటో అంత సుళువుగా తెలీదు అతనికి.

మల్లె దండ అతని చేతికి తగిలి నప్పుడు "అంతా సింథటిక్ అయిపోయింది....ప్లాస్టిక్ పువ్వులా? ఇదేం వెర్రి నీకూ?" అని తేలిగ్గా నవ్వేసి దగ్గరికి తీసుకున్నాడు.

రాత్రంతా సుషమ మనస్సులో రెండో ఈక్వేషన్ మెదులుతూనే ఉంది.

వాసన లేని పూలు. అతనికి అభ్యంతరం లేదు.

"వాసన లేని పువ్వులైతే ఫరవా లేదు....పువ్వులు లేని పరిమళ మైతే ఒకే! ఒకే మాత్రమే కాదు... ఆ పరిమళానికి నీ మన్మథుడు పరవశుడై పోతాడు!" అంటూ అంతా బేరీజు వేసి తీర్మానించింది జానకి. "అయితే అతని మనస్సులో ఏదో ఫిక్సేషన్ ఏర్పడి పోయిందన్న మాట...దాన్ని సరిచేయాలంటే ఒకే ఒక్క దారి...రేపు సాయంత్రం వస్తాను...నన్ను పరిచయం చెయ్యి...ప్రయోగం చేస్తా...."

"అమ్మో! ప్రయోగమే!"

"భయపడకు...నా ప్రయోగంతో నీ మన్మథుడేమీ రాక్షసుడై పోడు...అయితే గియితే పూల బాణాల మన్మథుడే అవుతాడు! ఎస్!.."

"అమెరికాలో సెటిల్ అయ్యారా? అదీ సైకో ఎనలిస్ట్ గానా! దటీజ్ వండ్రఫుల్!" అంటూ జానకిని అభినందించాడు మనోజ్. "కానీ ఇండియాలో

చాలా మంది మానసిక సమస్యలతో సతమతమౌతున్నా ఎనలిస్ట్‌ల దగ్గరికి వెళ్లరు ...ఎందుకనో?" అన్నాడు.

"ఎనలిస్ట్‌లే వచ్చినా...వాళ్ళ సర్వీస్ తీసుకోవడానికి భయపడతారు..." అంది జానకి. "పోనీ....జస్ట్ ఒక ప్రయోగం అనుకోండి...మిమ్మల్ని హిప్నటిక్ ట్రాన్స్ లోకి పంపుతానంటే మీరు మాత్రం ఒప్పుకుంటారా?"

"ఆహా...నాకేం అవసరం?"

"మా వారికేం అవసరం లేదు కద!" అంది సుషమ చూస్తూ ఊరుకోక.

"అవసరమే ఉండ నవసరం లేదు. జస్ట్ ఒక ప్రయోగం...దాంతో ఆత్మ విశ్వాసం ఇంకా రెట్టింపు కావచ్చు...పర్సనాలిటీ ఇంకా వెలిగి పోవచ్చు...కాని హిప్నటైజ్ కావడానికి బోలెడు ధైర్యం కావాలి లెండి..." అంది జానకి.

"నాకన్న ధైర్య వంతుడు మీకు దొరకడు...నన్ను హిప్నటైజ్ చెయ్యండి చూద్దాం..అయితే...అలా చేసి నా చేత ఏ ఘాతుకాలో హత్యలో చేయిస్తే మాత్రం చరిత్ర క్షమించదు సుమా...కమాన్...అయాం రెడీ..."

అలా సీన్ మారింది.

"మనోజ్...నువ్విప్పుడు రిలాక్స్ అవుతున్నావు...పూర్తిగా రిలాక్స్ అవుతున్నావు.. కళ్ళు మూసుకుంటున్నావు...నీ కిప్పుడు నిద్ర వస్తుంది...మగత నిద్ర వస్తుంది..."

సుషమ చూస్తూనే ఉంది. జానకి మనోజ్‌ను హిప్నటైజ్ చేసేసింది.

మంత్రానికి లొంగి పోయిన పసి బాలుడిలా మనోజ్ జానకి అదుపు లోకి వెళ్ళి పోయాడు.

"మనోజ్...నీకు లైఫ్ ఎంతో బావుంది... అద్భుతంగా ఉంది...నీ వర్క్ నీకు ఇష్టం...ఆఫీస్ ఇష్టం...నీకు చాలా ఇష్టాలు ఉన్నాయి...ఇంకా నీకు ఏమేం ఇష్టమో ఇప్పుడు నువ్వే చెప్తావు..."

కలలో మాట్లాడు తున్నట్టు చెప్ప సాగాడు మనోజ్: "నాకు ఐస్ క్రీం ఇష్టం....బిథోవెన్ మ్యూజిక్ ఇష్టం...ఇళయరాజా బీట్లు ఇష్టం .... సూర్యో దయాలూ...సూర్యాస్తమయాలూ....చాలా ఇష్టం...కొంచెం వోడ్కా ఇష్టం...వావ్...అద్భుతంగా ఉంటుంది..."

"ఆఁహాఁ..." అంటూ లీడ్ చేసింది జానకి. "అలాగే నీకు ఏవేవి ఇష్టం లేదో కూడా సరిగ్గా తెలుసు నీకు...ఏవేవి ఇష్టం లేదంటే..."

"అయ్ డోంట్ లైక్ బ్లాక్!...నలుపు రంగు ఇష్టం లేదు...టాయ్‌లెట్ క్లీన్‌గా లేక పోతే...గ్గాడ్...భరించ లేను...అలాగే..."

వరసలో వరస అన్నట్టు అంది పుచ్చుకుంది జానకి..."పువ్వులంటే నీకు ఇష్టం లేదు...ఎలర్జీ..."

ఉన్నట్టుండి చిరాగ్గా అసహనంగా కదిలాడు మనోజ్. "అవునూ...పువ్వులు ఇష్టం లేదు...ఛీఛీ...కరిచేస్తాయి...కుట్టేస్తాయి....వొళ్ళంతా పీకేస్తాయి..."

జానకి సుషమ ముఖముఖాలు చూసుకున్నారు. ఏ భావమూ ధ్వనించని స్వరంతో అంది పుచ్చుకుంది జానకి..."పువ్వులు ఎలా కరిచేస్తాయీ అంటే...ఎలా కుట్టేస్తాయీ అంటే...వొళ్ళంతా ఎలా పీకేస్తాయీ అంటే...అంతా ఎప్పుడు జరిగిందీ అంటే..."

సుషమ నివ్వెర పోయి చూస్తుండగా కలవరిస్తున్నట్టు చెప్పుకు పోయాడు మనోజ్...."ఎలా జరిగిందీ అంటే..చిన్నప్పుడూ...మమ్మీతో కాకినాడకు వెళ్ళినప్పుడూ...కల్యాణ మండపంలో అందరూ...ఎక్కడెక్కడో ...హడావుడిగా తిరుగుతున్నప్పుడూ...."

"అప్పుడు నువ్వెక్కడున్నావూ అంటే...."

"నిద్రొచ్చి ఆ గదిలోకి వెళ్ళి పడుకున్నానా...పక్కన టేబుల్ మీద పెద్ద పెద్ద బుట్టలు ఉన్నాయా....అవన్నీ పూల బుట్టలే..వాసనకి ఇంకా నిద్ర పట్టేసింది...నేను కింద పడుకున్నానా...నిద్ర పోతుంటే...ఒక్క సారిగా...వొళ్ళంతా ...కుట్టేశాయి.... కొరికేశాయి... పూలన్నీ మీద పడ్డాయీ....పువ్వుల నిండా చీమలే...ఎర్ర చీమలు...కండ చీమలు...ఆ టేబుల్ మీదే స్వీట్లున్నాయీ...పూల బుట్టల నిండా చీమలే...కుట్టేశాయి...పీకేశాయి...బుట్టలు నా మీద ఎట్లా పడ్డాయో...ఎవరు తోశారో...ఛిఛీ...చీమలు కుట్టేస్తాయి....పువ్వులు కుట్టేస్తాయి...కొరికేస్తాయి...."

సుషమ ముఖంలో ఒక్క సారిగా మబ్బు విడిచి వెన్నెల విరగ్గాసింది. దిగ్విజయంగా సగర్వంగా నవ్వుతూ జానకి ప్రయోగం కొనసాగించింది.

"కాని మనోజ్...అదంతా చిన్నప్పుడు....చాలా చిన్నప్పుడు..."

"ఎస్...చిన్నప్పుడు...ఏడేళ్ళప్పుడు...."

"ఇప్పుడు నువ్వు పెద్ద వాడి వైపోయావు...చాలా పెద్ద వాడి వయ్యావు ...నువ్విప్పుడు బోయ్‌వి కాదు...మ్యాన్‌వి....పువ్వుల్లో చీమలు ఎప్పుడూ

ఉండవు...అసలుండవు...."

"అవును...ఉండవు..."

"ఆ విషయం నీకిప్పుడు చాలా స్పష్టంగా తెలిసి పోయింది ...క్లియర్....కాన్ఫిడెంట్...."

"అవును....క్లియర్...పువ్వుల్లో చీమలు ఉండవు..."

"విషయం తెలిసి పోయింది కాబట్టి నీ కిక పువ్వులంటే భయం లేదు..."

"లేదు..."

"ఎలర్జీ లేదు..."

"అండ్ యూ లైక్ ఫ్లవర్స్! దేవుడి సృష్టిలో అద్భుతాలు పువ్వులు ...పువ్వులంటే నీకు చాలా ఇష్టం. చాలా చాలా ఇష్టం..."

"అవును. అయ్ లవ్ దెమ్...సుషమకు పువ్వులంటే ప్రాణం...నాకు సుషమ అంటే ఇష్టం...ప్రాణం...అందుకే ఇక పువ్వులంటే మాకిద్దరికీ ఇష్టమే....ఎస్!..."

ఆ రాత్రి మల్లె పూల మంచం నిద్ర పోలేదు.

"థేంక్యూ జానకీ...థేంక్యూ..." అని అతనన్నాడో ఆమె అన్నదో తెలీదు. లేక పువ్వులే అలా అన్నాయేమో!

పరిమళం కమ్మేసింది.